# (అ)క్షయ తృతీయ

-భమిడిపాటి సోమయాజి

"అక్షయ తృతీయ వచ్చేస్తోంది!" అంది సత్యభామ.

"ఏమిటి అదేదో కొత్త సినిమా వచ్చేస్తోందన్నట్లు చెపుతున్నావ్" అన్నాడు సత్యభామాపతి, కృష్ణమూర్తి.

"ఏమిటో మీకన్నీ సరసాలే! అసలీ అక్షయ తృతీయ ప్రాముఖ్యత మీకు వంటబట్టలేదు. ఆరోజు బంగారం కొని ఇంటికి తెచ్చుకుంటే సంవత్సరమంతా సిరిసంపదలతో వర్ధిల్లుతాం తెలుసా?"

"తెలీదు! కొన్ని దానాలు చేస్తే మంచిదని మాత్రం తెలుసు" అన్నాడు కృష్ణమూర్తి.

"అసలు నిజంగా నేను అదృష్టవంతురాల్ని! రెండు నెలలకి అక్షయ తృతీయ వస్తుందనగా మీ పదవీ విరమణ అవడం. మీకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చేతికందడం అన్నీ కలిసొచ్చాయ్!" అంది సత్యభామ.

"ఏమిటో! నా పదవీ విరమణ నీకెలా కలిసొచ్చిందో తెలియటం లేదు"

"అదేమిటీ! యిది కూడా తెలీదా! భర్తలో సగభాగం భార్య! మీకొచ్చిన డబ్బులో సగభాగం నాదేకదా మరి! మరి నా వాటా డబ్బులో యీ అక్షయ తృతీయకి నేను బంగారం కొనుక్కోవచ్చు కదా!" అంది సత్యభామ.

"బాగుంది! వచ్చిన డబ్బులో సగం పెట్టి బంగారం కొనేసుకుంటే గొప్పనుకుంటున్నావ్ కాబోలు! మనకొచ్చే పెన్షన్ చాలదు. డబ్బు దాచుకుంటే, నెలనెలా వడ్డీ వస్తుంది! ఈ విషయం తెలుసుకో"

"అంటే నా కోరికలు తీర్చరన్నమాట. అసలు నేనంటే మీకు ప్రేమలేదు" అంది భామ.

"అదేమిటి భామా! నాకున్నది ఒకే భార్య నీమీద ప్రేమెందుకుండదు. నీకు నా ప్రాణం కావాలంటే కూడా యిస్తాను"

"సరే మీ యిష్టం! ఓ ఏభై వేలు పెట్టి గాజులు కొనుక్కుంటాను"

ఖర్చు ఏ లక్షో దాటిపోతుందనుకున్న కృష్ణమూర్తి "బలే మంచి చౌకబేరము" అనుకుంటూ ఒప్పేసుకున్నాడు.

★ ★ ★

మధ్యాహ్నం భోజనాలయిన తర్వాత భగీరథి వచ్చి 'ఏం వదినా నా అక్షయ తృతీయ సందర్భంగా ఎంత కొంటున్నావ్ బంగారం?" అని అడిగింది సత్యభామని అదేదో చింతపండు కొంటూన్నట్లు.

"ఎంతంటే ఏం చెప్తాం! ఓ ఏభైవేలు యిస్తానన్నారు మీ కృష్ణన్నయ్య"

"అన్నయ్యా ఓ పాతిక వేలిస్తే నేను కూడా బంగారం కొనుక్కుంటాను. ఓ ఆర్నెల్లలో బాకీ తీర్చేస్తాం!" అంది భగీరథి.

"మీ అన్నయ్యని నువ్వే అడుగు" అంటూ "ఏవండీ భగీరథి వదిన వచ్చింది" అని కృష్ణమూర్తిని పిలిచింది.

"అన్నయ్యా" అంటూ అప్పు అడిగింది భగీరథి. ఏమనాలో తేల్చుకునేలోపులో "అలనాడు ద్రౌపదికి శ్రీకృష్ణుడు చీరలు అక్షయం చేశాడు ఈనాడు ఈ భగీరథికి బంగారం అక్షయమయ్యే సహాయం చెయి!" అంది ఆవిడ.

మొన్ననే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందాయి. డబ్బులేదంటే బాగుండదు అని ఆవిడ అడిగిన పావు లక్ష యివ్వడానికి ఒప్పుకున్నాడు కృష్ణమూర్తి.

భగీరథి వెళ్ళిన ఓ గంటకి కృష్ణమూర్తి పెద్ద బావమరిది వరంగల్‌నుంచి ఓ రెండు కిలోల ఎండుమిర్చి పట్టుకు దిగాడు.

"ఏమిట్రా అన్నయ్యా ఏదో తెచ్చినట్లున్నావ్!" అంది సత్యభామ.

"ఆ ఏం లేదు వరంగల్ మిర్చి! ఇది ఆడించి ఊరగాయ పెట్టు బాగుంటుంది!" అన్నాడు.

"చాలా సంతోషం! అక్షయ తృతీయనాడు ఊరగాయ పెడతాను. ఏడాదంతా ఊడట అక్షయమవుతుంది" అంది భామ.

"అవును! అన్నట్లు అక్షయ తృతీయ అంటే జ్ఞాపకం వచ్చింది, బావగారు బంగారం ఎంత కొంటున్నారు!"

"ఎంతరా ఓ ఏభైవేలు!"

"అవును అన్నట్లు బావగారు మంచి సమయానికి రిటైర్ అయ్యారు. ఏ ఏభైవేలు నాకు అప్పిస్తే మీ వదినకి ఓ నల్లపూసల దండ, ఓ నెక్లెసు, నాకొక బ్రేస్‌లెట్ కొనుక్కుంటాం. ఈ అప్పు ఊరికే యివ్వద్దులే. వడ్డీ యిస్తాను!" అన్నాడు భామ అన్నయ్య.

"సర్లే! నేను మీ బావగారితో మాట్లడతాను. నువ్వేం మాట్లాడకు. అసలే మంట మీదున్నారు పైగా యీ వరంగల్ మిర్చి ఘాటొకటి" అంది భామ.

"ఏవండీ చూశారా! మా అన్నయ్య వరంగల్ మిర్చి మోసుకొచ్చాడు. నేనంటే చాలా ప్రేమండీ వాడికి!"

"ఓ రెండు కిలోల వెధవ మిరపకాయకి, అదేదో సంజీవపర్వతం మోసుకొచ్చినట్లు చెప్తావేమిటి!" అన్నాడు కృష్ణమూర్తి.

ఇంకో సందర్భంలో తన పుట్టింటివాళ్లు తెచ్చిన మిరపకాయని వెధవ మిరపకాయ అన్నందుకు తాట ఒల్చేసి వుండేది. తన అన్నయ్య అడిగిన అప్పు పుట్టదేమో అని వూరుకుంది. "అవునూ మీరు మనకి వచ్చిన డబ్బు డిపాజిట్‌లో వేస్తే నెలనెలా వడ్డీ వస్తుందన్నారు కదా! ఎంత వడ్డీ వస్తుంది!" అని అడిగింది భామ.

"ఓ పది పర్సెంట్" అన్నాడు.

"ఎవరైనా నమ్మకస్తులు, ఓ పద్నాలుగు పెర్సెంట్ వడ్డీ యిస్తే వాళ్ళకి అప్పివ్వచ్చు కదా!" అంది.

"ఆ! అంత నమ్మకస్తులు ఎవరీ రోజుల్లో!'' అన్నాడు.


"మా అన్నయ్య సిద్ధంగా వున్నాడు. ఓ ఏభై వేలు అడుగుతున్నాడు. మా వదినకి నెక్లెస్, నల్ల పూసల దండతోపాటు, వాడికి ఓ బ్రేస్‌లెట్‌కూడా కొనుక్కుంటాడట. పెళ్ళిలో మీ గెడ్డంక్రింద బెల్లం పెట్టి కొట్టినప్పట్నుంచీ వాడి కుడిచెయ్యి బోసిగా వుండిపోయింది. ఏ ముహూర్తాన వాడు మీ గెడ్డంక్రింద బెల్లంతో కొట్టాడో, మీరు గెడ్డం గీసుకొనేటప్పుడు, ఒక్కసారి కూడా మీగెడ్డం తెగ లేదు. అంత శుభప్రదమైన వాడి కుడిచెయ్యి బోసిగా వుండడం నేనిక చూడలేకపోతున్నాను.

ఓ ఏభైవేలిచ్చెయ్యండీ పాపం! ఓ బ్రేస్‌లెట్ కొనుక్కుంటాడు'' అంది భామ.

"ఎప్పటి పెళ్ళి! ఎప్పటి గెడ్డం! ఎప్పటి బెల్లం! అసలు అప్పుడే కాశీయాత్రకి పోయుంటే వదిలి పోయేది, అసలీ అక్షయ తృతీయకి, బంగారం ఎంతమందికని ఏర్పాటు చెయ్యగలను. ముప్ఫయిదు ఏళ్ళు ఎండ అనక, వాన అనక కష్టపడి పనిచేస్తే వచ్చిన డబ్బు, ఈ 'అక్షయ తృతీయ' అప్పళించేటట్లుంది'' అని విచారవదనంతో విచారిస్తున్న సమయంలో బెడ్‌రూమ్‌లోకి వచ్చేశాడు బావమరిది.

"ఏంటి బావగారూ! ఏదో తలనొప్పితో వున్నట్లున్నారు. ఎర్రటి రంగుతో వెలిగిపోతున్న ఆ వరంగల్ మిర్చి చూడండి! వెంటనే ఆహ్లాదం కలుగుతుంది''

"అసలీ అప్పు యివ్వకపోతే ఆ మిర్చి నా కంట్లో పెట్టేటట్లున్నాడు'' అని ఓ నలభై వేలివ్వడానికి ఒప్పుకున్నాడు కృష్ణమూర్తి.



* * *

సత్యభామ, సత్యభామా సోదరుడు, భగీరధీ సమేతంగా కృష్ణమూర్తి, అక్షయ తృతీయ సందర్భంగా, బంగారం కొనడానికి అమీర్‌పేట వెళ్ళాడు.

"అబ్బ ఎక్కడ చూసినా జనమే జనం! అబ్బ! బావగారూ! పుడమితల్లి యీనిందా అన్నట్లు వున్నారీ జనం!'' అన్నాడు బావమరిది.

"ఇది పుడమితల్లి సంతానం కాదు, శ్రీదేవి సంతానం!'' అన్నాడు కృష్ణమూర్తి.

"హ్హహ్హా!" అంటూ "గొప్ప జోక్ పేల్చారు బావగారూ!" అన్నాడు యింకో పదివేలేమైనా అప్పిస్తాడేమోనని.

"వెధవ్వేషాలెయ్యకు. నలభైకి మించి యింకొక్క రూపాయికూడా రాబట్టలేవు" అనుకున్నాడు కృష్ణమూర్తి.

"అసలీ అమీర్‌పేటలో బంగారం కొనుక్కునే సరికి అక్షయ తృతీయ వెళ్ళిపోతుందేమో!" అంది భామ.

"ఓ గొడవ వదిలిపోతుంది!" అనుకున్నాడు కృష్ణమూర్తి.


ఇంతలో నామాలు పెట్టుకున్న ఒకాయన "ఆండాళ్ళూ! ఈ అమీర్‌పేటలో రొంబ కష్టం!" అన్నాడు.

ఇంతలో అతని పక్కనే వున్న కృష్ణమూర్తి బావమరిది అతనికేసి చూశాడు.

ఆ నామాలాయన "ఎన్న వేణుం" అన్నాడు.

## భూమి కథ

బైబిలు ప్రకారం భూమి వయస్సు కేవలం 6012 ఏళ్ళు. 1779లో శాస్త్రజ్ఞుడు రష్యన్ లొమోనోసోల్ థియరీ ప్రకారం 75 వేల ఏళ్ళు. 1790లో బ్రిటిషు శాస్త్రజ్ఞుడు విలియం స్మిత్ ఫోసిల్సును పరిశోధించి



భూమి వయస్సు 9.6 కోట్ల ఏళ్ళని అంచనా వేసాడు. 1862లో భౌతిక శాస్త్రజ్ఞుడు విలియం థామ్సన్ లెక్కలు కట్టి 2.4-40 కోట్ల మధ్య ఏదయినా కావచ్చన్నాడు. తర్వాత భూగర్భ శాస్త్రజ్ఞులు ఖనిజాలను పరిశోధించి ఇంత తక్కువ వయస్సు ఉండదన్నారు. 1900లో జాన్ జోలీ అనే దక్షిణాఫ్రికా శాస్త్రజ్ఞుడు సముద్ర లవణాలను పరిశోధించి భూమి వయస్సు 8-10 కోట్ల ఏళ్ళు ఉంటుందన్నాడు. ఇప్పుడు మోడ్రన్ జియోలజిస్టులు చాలాచోట్ల దొరికిన గ్రహశకలాల రేడియో మెట్రిక్ ఏజ్‌ని బట్టి భూమి వయస్సు 454 కోట్ల ఏళ్ళని తేల్చారు. భూమధ్యరేఖ చుట్టుకొలత 25000 మైళ్ళు. వ్యాసము 8000 మైళ్ళు. అయితే సూర్యుడు భూమికన్న 3,30,000 రెట్లు బరువైన వాడట!

-తటవర్తి

హర్నీ! నా పేరు 'వేణూ' అని యీయనకెలా తెలుసు అనుకున్నాడు కృష్ణమూర్తి బావమరిది.

తన బావగారితో యీ ముచ్చట చెప్పాడు.

"ఓరి వెర్రినాయనా 'ఎన్న వేణుం' అంటే తమిళంలో 'ఏం కావాలి?' అని అర్థం. అసలు నీకు మాతృభాషే తెలియదు. పరాయిభాషేమర్థమవుతుంది.

ఆ నామాలాయన "అసలు కొంతమంది చార్‌మినార్ దగ్గరకెళ్ళి 'బిస్కట్ బంగారం' కొనుక్కోవచ్చుకదా" అన్నాడు ఆండాళ్ళుతో.

"అవును! నిజమే! మనం అక్కడకే పోదాం" అంది ఆండాళ్ళు.

బిస్కెట్ బంగారం శ్రేష్ఠమని యిదివరలో విన్న వేణు, తన బావగారితో "బిస్కెట్ బంగారం కొనుక్కుందాం!" అన్నాడు.

"ఎక్కడకని పోతాం!" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆ నామాలయానతో పోదాం! వాళ్ళుకూడా బిస్కెట్ బంగారం కొనే ప్రయత్నంలో వున్నారు" అని బంగారం వేణమ్ అన్నాడు, ఆ నామాలాయనతో.

"అప్పిడియా! శీఘ్రమమా పోదాం!" అని వాళ్ళని చార్మినార్ తీసుకుపోయారు, ఆండాళ్ళు ఆమె భర్త.

* * *

చార్మినార్ దగ్గర ఓ సందు మొగలో, కృష్ణమూర్తి మేళాన్ని వుండమని నామాలాయన కొంత డబ్బు తీసుకుని పయనమైపోయాడు. ఆండాళ్ళు తమతోపాటే వుందికదా, డబ్బు ఎక్కడికి పోతుందనుకుంది కృష్ణమూర్తి వెర్రిమేళం.

అమీర్‌పేట జనం కంటే చార్మినార్ జనం తక్కువా? ఆ జనంలో కలిసి పోయింది ఆండాళ్ళు.

అర్థరాత్రి పన్నెండుదాటిపోయింది.

ఎవర్ని చూసినా నామాలాయనలా కనిపించాడు యీ మేళానికి. అక్షయ తృతీయ చార్మినార్ ఎక్కి, ఆకాశంలోకి వెళ్లిపోయింది.

భగీరధి కూడా నీరుకారిపోయింది.

అక్షయ తృతీయ పేరుచెప్పి ఓ లక్షా నలభైవేలు నుక్కొనయింది కృష్ణమూర్తికి. అప్పులిస్తే నెలనెలా వడ్డీ వస్తుందనుకుంటే, వడ్డీమాట ఆ వడ్డీకాసుల వాడికి ఎరుక అసలు సొమ్మే పోయింది అని బాధపడుతున్న కృష్ణమూర్తిని, "యిదిగో! ఏమండోయ్ మిమ్మల్నే తొందరగా ఉరికి ఉరికి రండి! మన ఆండాళ్ళుని టీవీలో చూపిస్తున్నారు" అని పిలిచింది సత్యభామ.

ఆండాళ్ళుగా చెలామణీ అవుతున్న ఆ అందాలభామ పక్కనవున్న ఆ నామాలాయన పాతకేడీలనీ, అక్షయ తృతీయనాడు జనం మీదకి పంజావిసిరి అక్షరాలా ఆరు లక్షలు ఎత్తుకుపోయారని ఆచూకీ తెలిపిన వారికి బహుమతీ యిస్తారని టీవీలో చెప్పారు.

"పోతే పోయిందిగాని మా బలే అందంగా వుందండి మన ఆండాళ్ళు!" అంది సత్యభామ.

"మన ఆండాళ్ళు మన ఆండాళ్ళు అంటున్నావేమిటి ఆ దొంగల రాణీ నీకేమైనా మేనత్తకూతురా, మేనమామ కూతురా! ఈపైనెప్పుడైనా అక్షయ చతుర్థి, అక్షయ పంచమిలాంటివి అన్నావంటే నరికి పోగులు పెడతాను" అన్నాడు కోపంతో వూగిపోతూ కృష్ణమూర్తి.

ఎందుకైనా మంచిదని 'భామనే! సత్యభామనే' వేషాలు బందు చేసింది సత్యభామ.

★